క్లుప్తంగా

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ క్రాంతి కిరణ్మయి, సిబ్బంది

బలిజిపేట: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి క్రాంతి కిరణ్మయి సూచించారు. పెందపెంకి గ్రామంలో పాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు, క్యాన్సర్ సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే రోగాలు సోకుతాయన్నారు. పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం



మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మక్కువ: స్థానిక సచివాలయంలో 'సంకల్పం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను ఏఎస్సై శ్రీనివాసరావు ప్రజలకు వివరించారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జీవితాలు నాశనమవుతాయని, కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతాయని అన్నారు. భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల పరిశీలన



లేఅవుట్‌లో వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ అధికారి కామేశ్వరరావు

సాలూరు: పట్టణంలోని గుమడాం-3 లేఅవుట్‌లో విజిలెన్స్ అధికారి ఎ.కామేశ్వరరావు గురువారం తనిఖీలు చేశారు. హౌసింగ్ అధికారి శ్రీనివాసరావుతో కలిసి లేఅవుట్‌కు వెళ్లిన ఆయన గృహనిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి స్థలం మంజూరు, నిర్మాణాల ప్రగతి, బిల్లుల చెల్లింపు, తదితర అంశాలపై ఆరాతీశారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. బిల్లు చెల్లింపులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు.

నేడు రెవెన్యూ సదస్సు

మక్కువ: మండలంలోని దబ్బగెడ్డ, వెంకటభైరిపురం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షేక్ ఇబ్రహీం గురువారం తెలిపారు. సదస్సులకు రెవెన్యూ సిబ్బంది పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. ఆయా పంచాయతీల ప్రజలు తాము ఎదుర్కొంటున్న రెవెన్యూ, భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

మక్కువలో పారిశుద్ధ్య పనులు



జేసీబీతో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

మక్కువ: మండల కేంద్రం మక్కువలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని అన్ని వీధుల్లో పేరుకుపోయిన పూడికలను జేసీబీ సాయంతో తొలగించి ట్రాక్టర్లతో డంపింగ్‌యార్డుకు తరలించారు. అనంతరం వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పరిసరాలను పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పి.దేవకుమార్, పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పాము హల్‌చల్

పార్వతీపురం: జిల్లా కలెక్టర్ కార్యాలయ ముఖద్వారం వద్ద గురువారం సాయంత్రం ఓ పాము హల్‌చల్ చేసింది. జనసంచారం లేని సమయంలో కార్యాలయం మెట్ల వద్దకు వచ్చి అటూ ఇటూ సంచరించింది. మనుషుల అలికిడిని గుర్తించి సమీపంలో ఉన్న పూల మొక్కల్లోకి వెళ్లిపోయింది. అక్కడ ఉన్నవారు దాన్ని బయటకు పంపించేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కలెక్టరేట్ వెనుక వైపు పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పాములు వస్తున్నాయని స్థానికులు అంటున్నారు.

నాడు సంక్షేమం.. నేడు సంక్షోభం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మెంటాడ మండలం చల్లపేటలో రూ.1.74 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం
- హామీలు అమలు చేయకుండా కాలయాపన
- విద్యుత్, నిత్యావసర ధరల పెంపుతో ప్రజలపై ఆర్థిక భారం
- గత ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమం

గత ప్రభుత్వంలో జిల్లాలో అందించిన సంక్షేమ పథకాల లబ్ధి ఇలా..

సంక్షేమ పథకం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి(రూ. కోట్లలో)
రైతు భరోసా	1,45,954	856.37
ఆక్వా రైతుల సంక్షేమం	4,322	2.73
జగనన్న అమ్మ ఒడి	83,733	493.28
వైఎస్సార్ చేయూత	77,995	523.64
వైఎస్సార్ ఆసరా	1,88,072	282.79
వైఎస్సార్ పింఛన్ కానుక	1,45,291	491.89
నవరత్నాలు-పేదలందరికీ ఇల్లు	27,242	276.32
జగనన్న విద్యాదీవెన	20,306	23.42
జగనన్న వసతి దీవెన	17,172	15.84
వైఎస్సార్ కళ్యాణమస్తు	1700	11.84

గడపగడపకు మన ప్రభుత్వంలో అభివృద్ధి	
ప్రతిపాదిత పనులు	1766
అంచనా వ్యయం	రూ.44.73 కోట్లు
పూర్తయినవి	856
పురోగతిలో ఉన్నవి	910 (ఎన్నికల కోడ్ రావడంతో నిలిచినవి)
గతంలో ప్రాధాన్యత భవనాల నిర్మాణం ఇలా..	
గ్రామ సచివాలయాలు	311
రైతు భరోసా కేంద్రాలు	301
వైఎస్సార్ హెల్త్ సెంటర్లు	192
డిజిటల్ లైబ్రరీలు	85 మంజూరు
బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్లు	18
ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇలా..	
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	37
కొత్తగా నియమించిన వైద్యులు	83
యూపీహెచ్‌సీలు	5
సీహెచ్‌సీలు	3
108 వాహనాలు	17
104 వాహనాలు	31
తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్	16
ఎస్ఎన్‌సీయూ యూనిట్లు	03
జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు	292
ప్రయోజనం పొందిన వారు	1,29,191

పార్వతీపురంటౌన్:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులం, మతం, రాజకీయాలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేవి. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ఆయా రంగాల్లో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసింది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థల ఏర్పాటుతో లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు ఆయా వ్యవస్థల ద్వారా ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను చేరువచేసింది. ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు మంజూరు చేయడంతో పాటు ఇంటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయం ప్రభుత్వమే అందించింది. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు కల్పించడం జరిగింది. వైద్యం ఖర్చు వెయ్యి రూపాయలు దాటితే ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటు వైద్య సేవల పరిమితిని రూ.25 లక్షలకు పెంచారు. ఇలా చెప్పుకుంటూ పోతే.. అన్ని వర్గాల ప్రజలకు జగనన్న ప్రభుత్వం జనరంజక పాలన అందించింది.

కూటమి ప్రభుత్వంలో ప్రజలపై ఆర్థిక భారం

సూపర్‌సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోంది. ప్రజా సమస్యలను గాలికొదిలేసి పబ్బంగడుపుకుంటోంది. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు, నిత్యావసర ధరలు తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చి ఆరు నెలల్లోనే రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపారు. సంపద సృష్టి పేరుతో నిత్యావసర సరుకుల నుంచి కరెంటు బిల్లుల వరకు రేట్లు పెంచేసి సామాన్యుడిపై భారం వేస్తున్నారు. ఆస్పత్రుల్లో మందులు లేక రోగులు అవస్థలు పడుతున్నారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ అంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పాలన చూస్తుంటే 'బాబు ష్యూరిటీ-బాదుడు గ్యారంటీ' అన్నట్లు మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గత ప్రభుత్వంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

- పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణానికి రూ.600 కోట్లు మంజూరు
- రూ.64.25 కోట్లతో పార్వతీపురంలో సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం
- సాలూరులో ఇప్పటికే ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)ని రూ.17 కోట్లతో ఏరియా ఆస్పత్రిగా అభివద్ధి
- సాలూరు నియోజకవర్గంలో కొత్తగా ఐదు ప్రాథమిక వైద్యకేంద్రాల నిర్మాణం
- రూ.51 కోట్ల వ్యయంతో సీతంపేటలో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం
- సీతంపేటలో ఇప్పటికే ఉన్న 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)ని రూ.20 కోట్ల వ్యయంతో వంద పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్

ఆర్భాటాల కోసం ఉపాధ్యాయులపై ఒత్తిడి

సాలూరు: రాష్ట్ర ప్రభుత్వం మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌ల నిర్వహణలో భాగంగా ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావటం తగదని ఏపీటీఎఫ్ నాయకులు స్పష్టం చేశారు. పట్టణంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాలలో సాధారణంగా జరిగే ఈ సమావేశాన్ని కూటమి ప్రభుత్వం కేవలం తమ ప్రచారం కోసం నిర్వహిస్తున్నట్లు ఉందన్నారు. 7న జరిగే ఈ సమావేశం కోసం గత 15 రోజులుగా ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తోందన్నారు. రెండు రోజులకు ఓ వీడియో కాన్ఫరెన్స్, మూడు రోజులకు ఓ రివ్యూ నిర్వహిస్తూ కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లకు ఆటంకం కల్పిస్తున్నట్లు ఆరోపించారు. ఈ ఆర్భాటం కేవలం ప్రచారం కోసమేనా అంటూ నిలదీశారు. రాష్ట్ర విద్యాశాఖ వైఖరి పట్ల ఏపీటీఎఫ్ తీవ్ర నిరసన తెలియజేస్తోందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ ఉమ్మడి జిల్లా నాయకులు

సమావేశంలో ఉమ్మడి విజయనగరం జిల్లా ఏపీటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు జోగినాయుడు, మన్యం జిల్లా కార్యదర్శి గౌరీశంకరరావు, పట్టణ అధ్యక్షురాలు ధనలక్ష్మి, తదితరులున్నారు.

సేంద్రియ ఎరువులతో భూమి సారవంతం

బలిజిపేట: భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వినియోగించడం ద్వారా సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు దిగుబడులు పెంచుకోవచ్చని ఏఓ శ్రావణ్‌కుమార్‌నాయుడు అన్నారు. ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా మిర్తివలసలో గురువారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వినియోగంతో భూసారం కోల్పోతుందని, దీని వల్ల పంట దిగుబడులు తగ్గిపోతాయన్నారు. పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరుగుతందన్నారు. మట్టి నమూనాలను ఏవిధంగా సేకరించాలో రైతులకు వివరించారు. పల్లం 5 ఎకరాలకు ఒక నమూనా వంతున, మెట్టు 25 ఎకరాలకు ఒక నమూనా చొప్పున సేకరించాలని సూచించారు.



భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

పదిలో మంచి మార్కులు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ సింహాచలం

బలిజిపేట: పదో తరగతి విద్యార్థులు పరీక్షలలో మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఎంఈఓ-1 సామల సింహాచలం అన్నారు. నారాయణపురం ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థి దశలో పదో తరగతి పరీక్షలు ఎంతో కీలకమని, అందులో మంచి మార్కులు తెచ్చుకుంటే ఉన్నత విద్యకు మంచి పునాది పడుతుందన్నారు. విద్యార్థులకు సబ్జెక్టులో ఎటువంటి సందేహాలు ఉన్నా వెంటనే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

సీతానగరం: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో ఉండాలని ఏఎస్సై లంక శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని లక్ష్మీపురం, గుచ్చుమిలో సైబర్ నేరాలపై గురువారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి మీ మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులను ఓపెన్ చేయొద్దని, బ్యాంకు ఖాతా, ఏటీఎం పిన్ నంబరు, ఓటీపీ వివరాలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. మానవ తప్పిదాల వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. సైబర్ నేరాలపై 1930 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

సేవలతోనే గుర్తింపు



మోహనరావును సత్కరిస్తున్న గ్రామస్తులు, సచివాలయ ఉద్యోగులు

సీతానగరం:

ఉద్యోగులు విధి నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలే వారికి గుర్తింపునిస్తాయని సర్పంచ్ తిరుపతినాయుడు, కె.శంకరరావు అన్నారు. గెడ్డలుప్పి పంచాయతీ కార్యదర్శి మోహనరావు బదిలీపై వెళ్లనుండటంతో గురువారం సాయంత్రం గ్రామస్తులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థ వచ్చినప్పటి నుంచి మోహనరావు పంచాయతీ కార్యదర్శిగా ఎనలేని సేవలందించారని కొనియాడారు. భవిష్యత్‌లో ప్రజలకు మెరుగైన సేవలందించి వారి మన్ననలు పొందాలని అన్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగులు మోహనరావును సత్కరించారు. విధి నిర్వాహణలో తనకు సహకరించిన ఉద్యోగులకు, స్థానిక పెద్దలకు సన్మాన గ్రహీత మోహనరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి



చందనం పూతతో లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నదీ తీరాన వెలసిన లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు స్వామివారిని చందనంతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇజాజ్ అహ్మద్ కుటుంబాన్ని ఆదుకోవాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

బలిజిపేట: రాయచోటిలో కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇజాజ్ అహ్మద్ అనే ఉపాధ్యాయుడిపై విద్యార్థులు దాడిచేసి హతమార్చడంపై ప్రభుత్వం స్పందించి ఆ కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. బలిజిపేట ఉన్నత పాఠశాల వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నేత ధనుంజయరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు చనిపోయి 24గంటలు గడిచినా ఇప్పటివరకు ప్రభుత్వం కాని, అధికారులు కాని ఏరకమైన ప్రకటనలు చేయకపోవడం చూస్తుంటే ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి ఇది నిదర్శనంగా భావించాల్సి వస్తుందన్నారు. దీన్ని ఫ్యాప్టో తరఫున ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం దీనిపై విధానపరమైన ప్రకటన చేసి ఉపాధ్యాయులు, ఉద్యోగుల ప్రాణాలను రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఎంఈఓ-1 సామల సింహాచలంకు మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధితోనే ఉపాధి

- మాజీ ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: అన్ని ప్రాంతాలు వాణిజ్యపరంగా అభివృద్ధి చెందిననాడే అందరికీ జీవనోపాధులు మెరుగుపడతాయని మాజీ ఎమ్మెల్యే జోగారావు అన్నారు. మండలంలోని పెదపెంకి అడ్డురోడ్డులో బి.మోహనరావుచే నూతనంగా నిర్మించిన అయ్యప్ప మోడ్రన్ రైస్ మిల్లును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ.. ప్రతీ మనిషి ఆర్థికంగా ఎదిగి మరికొంత మందికి జీవనోపాధి కల్పించిన నాడే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. వ్యాపారంలో రాణించి మండలంలో పలువురికి ఆసరాగా నిలవాలని కోరారు. అనంతరం పలగర మాజీ సర్పంచ్, పార్టీ సీనియర్ నాయకుడు ఎస్. భాస్కరరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయన్ను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, జడ్పీటీసీ రవికుమార్, పి.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.



రైస్‌మిల్లును ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

పశుగణన సర్వే వేగవంతం చేయాలి

సీతానగరం: జాతీయ పశుగణన సర్వేను వేగవంతం చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎం.మన్మథరావు అన్నారు. స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయం వద్ద సీతానగరం, బలిజిపేట, పశువైద్య సహాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 14,500 పశువుల పాకలు ఉన్నాయని, ఇప్పటివరకు 3859 సర్వే పూర్తయిందన్నారు. ఫిబ్రవరి 15లోగా సర్వేను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. 550 పశువులకు బ్రూసెల్లస్ టీకాలు వేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన గోశాలల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. మండల పశు వైద్యాధికారి ఎస్.రామారావు మాట్లాడుతూ.. మొదట విడతగా 23 గోశాలలు మంజూరయ్యాయని, మరో 28 గోశాలలకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. అలాగే ఉపాధిహామీ పథకం ద్వారా పశుగ్రాస సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ కె.ప్రసాదరావు, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ దీదీకుమార్, బలిజిపేట పశు వైద్యాధికారి జి.గణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి మన్మథరావు

ప్రతి అర్జీనీ పరిష్కరించాలి

సీతానగరం: గ్రామాల్లో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని తహసీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావు కోరారు. సదస్సుల నిర్వహణకు సంబంధించి వీఆర్వోలు, సర్వే సిబ్బందితో గురువారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ నెల 6 నుంచి జనవరి 8 వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. సదస్సులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారికి రశీదు ఇవ్వాలని, అర్జీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రతీ అర్జీపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ ఉమామహేశ్వరరావు

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

- భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం
- వచ్చే నెల 8 వరకు అన్ని గ్రామాల్లో నిర్వహణ

బలిజిపేట: భూ సమస్యల పరిష్కారం కోసం నేటి నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి భూ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులు వస్తుండటంతో వాటిని పరిష్కరించేందుకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సదస్సులో తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది అంతా పాల్గొంటారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని అక్కడికక్కడే లేదంటే నిర్దిష్ట సమయంలో పరిష్కరించనున్నారు.

సదస్సుల నిర్వహణ ఇలా..

- గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహణపై ప్రజలకు ముందస్తు సమాచారం ఇస్తారు. కార్యక్రమం లక్ష్యాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు.
- ఫిర్యాదులు స్వీకరించి అర్జీదారులకు రశీదు ఇస్తారు. ఆన్‌లైన్ విధానంలో అన్ని ఫిర్యాదులు నమోదు చేస్తారు.
- క్షేత్ర సందర్శనలతో ప్రతి సమస్యపై సమగ్ర విచారణ నిర్వహిస్తారు. సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరిస్తారు.
- గ్రామంలో రీసర్వే చేసినట్లయితే కొత్తగా తయారు చేసిన ఆర్‌ఓఆర్‌ను గ్రామసభలో చదివి, అభ్యంతరాలు ఏమైనా ఉంటే వాటిని చదువుతారు.
- కోర్టు కేసులను, ముఖ్యంగా హైకోర్టు కేసులను గుర్తించడానికి ప్రత్యే డ్రైవ్ నిర్వహించవచ్చు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు వాటిని పరిష్కరిస్తారు.
- గ్రామంలో సర్వే రాళ్లు ఉంటే, లోగోలు, పేర్లను చెరిపివేయవచ్చు.
- గ్రామంలో భూమికి సంబంధించిన వివాదాలు ఉంటే వాటి పరిష్కారానికి తహసీల్దార్ ముందు ఒక ఒప్పందానికి రావాలని సంబంధిత పార్టీలకు సూచించవచ్చు. వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి బృందంగా ప్రయత్నం చేయాలి.
- సరిహద్దు వివాదాలు ఉంటే మండల సర్వేయర్‌ను నియమించి భూమిని సర్వే చేయించి సమస్యను పరిష్కరించాలి.



బలిజిపేట తహసీల్దార్ కార్యాలయం

ఉద్యోగుల్లో కలవరం

రెవెన్యూ సదస్సుల నిర్వహణ ఉద్యోగులను కలవరపెడుతోంది. ప్రజలు వారి సమస్యలను సదస్సు దృష్టికి తీసుకొచ్చే క్రమంలో వీఆర్‌ఓలు, ఆర్‌ఐ, తహసీల్దార్లపై ఫిర్యాదులు చేసే అవకాశాలున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా పనులు జరగకపోవడం, లేనిపోని కొర్రీలు, చేతివాటాలు, అందుబాటులో ఉండని అధికారుల తీరు, తదితర అంశాలపై ప్రజలు అధికారులను నిలదీసే అవకాశాలుంటాయని అధికారులు, సిబ్బంది కలవరం చెందుతున్నట్టు సమాచారం.